# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 140 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 29 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## 14తో ముగియనున్న ఆధార్ అప్‌డేట్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): ప్రతి పనికి ఆధార్ తప్పనిసరి కావడంతో తప్పులు లేకుండా ఆధార్ నమోదు చేసుకోవాల్సి వస్తోంది. ఆధార్ ఒక్కసారి తీసుకుంటే సరిపోదు.. ఆధార్ కార్డులో ఏవైనా తప్పులున్నా లేదా అడ్రస్ చేంజ్ చేసుకోవాలన్నా, ఫోన్ నంబర్ మార్చుకోవాలన్నా కుడా ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటిదాకా కేంద్రం ఫ్రీగా ఆనర్‌లైన్లో ఆధార్ అప్డేట్ చేసుకునే సదుపాయం కల్పించింది. దీని గడువు త్వరలోనే ముగియనుంది. సెప్టెంబర్ 14 నాటికి ఫ్రీ ఆధార్ అప్డేట్ గడువు ముగియనుంది. ఈ లోగా ఆధార్ అప్డేట్ చేసుకోని వాళ్ళు వెంటనే అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

## ఆక్రమణల కూల్చివేతలపై

# వెనక్కి తగ్గేది లేదు

### చెరువుల పరిరక్షణ తమ తొలి ప్రాధాన్యం

- జన్వాడా లీజుకు తీసుకున్నామని అప్పుడు ఎందుకు చెప్పలేదు
- పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు అనుమతులు తెలియవా
- నా కుటుంబ కబ్జాలు ఉంటే నిర్భయంగా తెలియచేయండి
- నాలాలను కబ్జా చేసిన నేతలను కేసీఆర్ సస్పెండ్ చేయాలి
- హరీష్ రావు ముందుకు వస్తే చెరువలు పరిరక్షణ కమిటీ వేస్తా
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ



హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ మహానగరంలో హైడ్రా కూల్చివేతలపై రాజకీయ ప్రకంపనలు రేగుతున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఎప్పటికీ వెనక్కి తగ్గదని పూర్తి స్పష్టత ఇచ్చారు. తన మొదటి ప్రాధాన్యత చెరువులను కాపాడటమేనని, పార్టీలతో సంబంధం లేదని చెప్పారు. హైడ్రా తన పని తాను చేసుకుంటూ పోతుందని ఆయన స్పష్టం చేశారు. ' ఓల్డ్ సిటీ కాదు ఏ సిటీ అయినా వెనక్కి తగ్గేది లేదు' అని హెచ్చరించారు. 'హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువులు నాళాలపై కూల్చివేతలకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. నిబంధనలు పాటించని భవనాలను కూల్చివేస్తాం. తొలి కూల్చవేత మొదలుపెట్టిందే కాంగ్రెస్ నేత పల్లం రాజు నుంచేనని అన్నారు. కేటీఆర్ ఫామ్ హౌస్‌కి అనుమతి సర్పంచి నుంచి తీసుకున్నాం అని అంటున్నారు. సర్పంచ్ ఎలాంటి అధికారిక అనుమతులు ఇవ్వరని

..మిగతా 2లో



## తెలంగాణకు కేంద్రం శుభవార్త

### 3245 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

### దేశంలో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు

### తెలంగాణకు ఒకటి, ఆంధ్రప్రదేశ్‌కు రెండు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర కేబినెట్ సమావేశంలో.. ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 28,602 కోట్లతో దేశంలో 12 గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయనున్నారు. అయితే.. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 2, తెలంగాణకు 1 కేటాయించింది. తెలంగాణలోని జహీరాబాద్‌లో 3245 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో.. ఆ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయి. గతంలో మెదక్ జిల్లాలో ఉన్న జహీరాబాద్ నియోజకవర్గం.. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ తర్వాత సంగారెడ్డి జిల్లాలోకి వచ్చింది. అయితే.. సంగారెడ్డిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో జహీరాబాద్ ఒకటి. జహీరాబాద్ ప్రాంతంలో ఇప్పటికే పెద్ద పెద్ద కంపెనీలు ఉన్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ముంగి లాంటి పరిశ్రమలే కాకుండా.. నిజాం షుగర్స్ కూడా జహీరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. పరిశ్రమలకు తగినట్టుగా వాణిజ్య సదుపాయాలు, అనేక గోడౌన్లు ఉండటంతో పాటు.. చుట్టు పక్కన గ్రామాల్లో చెరుకు ప్రధాన పంటగా ఉండటం గమనార్హం. ఈ ప్రాంతంలోని పరిశ్రమలతో వేల మంది ఉపాధి పొందుతున్నారు. కాగా.. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుతో మరింత మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి దొరికే అవకాశం ఉంది. అంతే కాకుండా.. ఆ ప్రాంతమంతా అభివృద్ధి వైపు పరుగులు పెట్టే ఛాన్స్ ఉంది. ఇదిలా ఉంటే.. ఏపీకి కూడా రెండు ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు జిల్లా కొప్పర్తి లో 2596 ఎకరాల్లో ఒకటి, ఓర్వకల్‌లో 2,621 ఎకరాల్లో మరొక ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 12 స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయనుంది కేంద్ర ప్రభుత్వం. ఈ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం 28 వేల 602 కోట్లు

..మిగతా 2లో

## సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం



### సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సంబంధించి భూమిపూజ

### డిసెంబర్ 9నాటికి విగ్రహావిష్కరణ

### పూజలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు


హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): తెలంగాణ సచివాలయంలో డిసెంబర్ 9 నాటికి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే స్థలపరిశీలన చేసిన చోట విగ్రహం ఏర్పాటుకు పూనుకుంది. ఈ మేరకు బుధవారం భూమి పూజ నిర్వహించింది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పక్రియ చేపట్టారు. వేదమంత్రాలుగా సాక్షింగా 11 గంటలకు రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు పలుమార్లు చర్చించి సచివాలయంలో పోర్టికోకు ఎదురుగా విగ్రహం ఏర్పాటుకు

..మిగతా 2లో

## ఫిర్యాదులపై ఆధారాల సేకరణ

### పరిశీలించి నిర్ధారించుకుంటున్న హైడ్రా

### తాజాగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీలకు నోటీసులు



హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి, నిర్ధారించుకుంటున్న హైడ్రా నోటీసులు ఇస్తోంది. నేరుగా కూల్చివేతలకు దిగుతోంది. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి హైడ్రా షాక్ ఇచ్చింది. మర్రి రాజశేఖర్ ఇంజినీరింగ్ కాలేజీలకు హైడ్రా నోటీసులు పంపింది. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కాలేజీలను అక్రమంగా నిర్మించారంటూ హైడ్రా నోటీసులు పంపింది. వీటిని చిన్న దామెర చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో కట్టారంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అధికారులు నోటీసులు పంపించారు. దీనిపై 15రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. కాలేజీలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకో వాలని లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవంటూ రాజశేఖర్ రెడ్డిని హైడ్రా హెచ్చరించింది. దామెర చెరువులో నిర్మించిన మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీలను ఇటీవల హైడ్రా బృందం పరిశీలించింది. వాటిని అక్రమంగా నిర్మించారంటూ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే గతంలో చిన్నదామెర చెరువు

..మిగతా 2లో

## తెలంగాణకు అక్కరలేని

# విగ్రహాలను తొలగిస్తాం

### మరోమారు హెచ్చరించిన కేటీఆర్



హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలి దేవత అని అన్న నువ్వా రాజీవ్ గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది అని విమర్శించారు. దొడ్డి దారిన పీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద నువ్వు ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు అందరికీ తెలుసని అన్నారు. నీ ఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఏంటని అడిగితే కారుకూతలు కూస్తావా అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే అని విరుచుకుపడ్డారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది అని ఎద్దేవా చేశారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం

..మిగతా 2లో

## ప్రజాక్షేత్రంలో ఇంకా బలంగా పని చేస్తా..



### స్పష్టం చేసిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవితపై పార్టీ శ్రేణులు పూలవర్షం కురిపించాయి. బోకేలు ఇచ్చేందుకు కార్యకర్తలు, అభిమానులు పోటీపడ్డారు. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారిని చూసిన కవిత పిడికిలి బిగించి జై తెలంగాణ అంటూ నినదిస్తూ.. పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. అనంతరం భారీ కార్ల ర్యాలీతో సాయంత్రం జూబ్లీహిల్స్‌ని నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎప్పటికైనా

..మిగతా 2లో



### కోల్‌కతా హత్యాచార ఘటన

## విచారకరం

### నాగరిక సమాజం ఇలాంటివి అంగీకరించదు

### తొలిసారి స్పందిస్తూ తీవ్ర విచారం ప్రకటించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగస్ట్ 28 (ప్రభాత ఉదయం): కోల్‌కతాలో జరిగిన సంఘటనపై రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేస్తూ, మహిళలపై ఇలాంటి అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజంలోనూ అనుమతించలేమని రాష్ట్రపతి అన్నారు. సమాజం కూడా నిజాయితీగా, న్యాయంగా ఉండేందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలి. 2012లో ఢిల్లీ నిర్భయ కేసు మరువక ముందే.. దేశంలో లెక్కలేనన్ని అఘాయిత్యాలు జరుగుతుండటం బాధకరం అన్నారు. కోలకతా లో జరిగిన మరో అత్యంత దారుణమైన, హేయమైన చర్య అని రాష్ట్రపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా స్పందించారు. తీవ్ర విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ఈ ఘటన ఎంతో వేదనకు గురిచేసిందని, విషయం తెలిసి భయపడ్డానని ఓ వార్తా సంస్థకి ఇచ్చిన

..మిగతా 2లో

# ఆక్రమణల కూల్చివేతలపై వెనక్కి తగ్గేది లేదు

మొదటి పేజీ తరువాయి...

మున్సిపల్ మంత్రిగా పనిచేసిన కెటిఆర్‌కు తెలియదా అన్నారు.. జన్వాడ ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారు.. సర్పంచ్‌లు కాదని పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు తెలియదా?నా కుటుంబం కబ్జా చేసినట్లు కేటీఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తా. విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం అన్నారు. హైడ్రా కూల్చివేతలపై ఒత్తిళ్లు వస్తున్నాయి.. అయినా ఎదుర్కొంటాం.. వెనక్కి తగ్గేది లేదని సీఎం వ్యాఖ్యానించారు.ప్రజా ప్రయోజనాల కోసమే కూల్చివేతలు జరుగుతున్నాయి. గత పదేళ్లలో చెరువులను, నాలాలను కబ్జా చేసి కట్టినందుకు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి కేసీఆర్ సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కేవలం ఐదు నెలల్లో కవితకు బెయిల్ ఎలా వచ్చిందని సందేహం వ్యక్తం చేశారు. మనీష్ సిసోడియాకు బెయిల్ రావడానికి 15 నెలలు సమయం పట్టిందని, సీఎం కేజ్రీవాల్‌కు ఇప్పటికీ బెయిల్ రాలేదని ఆయన ప్రస్తావించారు. కవితకు ఇంత త్వరగా బెయిల్ రావడానికి బీజేపీ మద్దతు ఉందని అనుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ కోసం బీఆర్ఎస్ పని చేసిందని, 8 సీట్లలో బీజేపీ గెలవడానికి హరీష్ రావు పనిచేశారని విమర్శించారు. బీజేపీ – బీఆర్ఎస్ ఒప్పందం ప్రకారమే కవితకు బెయిల్ వచ్చిందని అన్నారు. అక్రమ కట్టడాలపై ప్రజా కోర్టులోనే తేల్చుకుందామని రేవంత్ రెడ్డి అన్నారు. 'నా కుటుంబ సభ్యులకు చెందిన అక్రమ కట్టడాలు ఉంటే ఆధారాలు తీసుకుని రావాలి. నేను కేటీఆర్ ఫామ్ హౌస్ అక్రమ కట్టడం అని ఆధారాలతో అక్కడికి వెళ్లాను. కేటీఆర్‌కి దమ్ముంటే నా కుటుంబ సభ్యులు లేదా నావి అక్రమ కట్టడాలు ఉంటే ఆధారాలతో రావాలి. 111 జీవోపై సుప్రీంకోర్టు, ఎన్జీటీ మార్గదర్శకాలను పాటిస్తున్నాం. చెరువులు, కుంటలలో కొన్ని భవనాలు కట్టుకోవడానికి సుప్రీంకోర్టు మినహాయింపు ఇచ్చింది. సెక్రటేరియెట్, జీహెచ్ఎంసీ లాంటి భవనాలకు సుప్రీంకోర్టు అనుమతి ఉంది. రాయదుర్గంలో కూల్చివేత సరైనదే. ఆ భూమి ప్రభుత్వ భూమి' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ కొడంగల్‌కు వెళ్లానంటే స్వాగతిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'కేటీఆర్ కొడంగల్‌కు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడాలి. కేటీఆర్‌ను వాళ్ల తండ్రి కేసీఆర్ నమ్మడు. కర్ణాటకలో వాల్మీకి స్కామ్‌తో మాకు సంబంధం లేదు. తెలంగాణ ఖాతాలు ఉన్నంత మాత్రాన మాకు సంబంధం ఉంటుందా?. వాల్మీకి స్కామ్‌లో బీఆర్ఎస్ నేతలకే లింకులు ఉండొచ్చు. డ్రగ్స్ కోసం కొంతమంది బీఆర్ఎస్ నేతలు బెంగుళూరు వెళ్లడం అందరికీ తెలిసిందేనని సీఎం అన్నారు. నేను రేవంత్ రెడ్డినని, తనకు, కేసీఆర్‌కు పోలిక ఏంటి సీఎం అన్నారు. 'నేను కొడంగల్, కోస్గి, కొండారెడ్డి పల్లికి మాత్రమే హెడ్‌ను కాదు. రాష్ట్రానికి హెడ్‌ను నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడు. ఆయన బయటకు రావాలి ప్రజల కోసం పోరాటం చేయాలి. కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడు హోదాలో జీతాలు ఇస్తున్నాం. జీతం తీసుకుంటున్నందుకు ప్రజల్లో తిరగాలి. ప్రభుత్వ వ్యవస్థలను వాడుకుంటున్న ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ పనిచేయకపోతే ఎలా?' అని సీఎం పేర్కొన్నారు. రుణమాఫీపై ధర్నాలు చేసేది బీఆర్ఎస్ కార్యకర్తలేనని, బీఆర్ఎస్ ధర్నాల్లో రైతులు లేరని, వాళ్ల పార్టీ కార్యకర్తలే ఉన్నారని విమర్శించారు. 'హరీష్ రావు, కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని గ్రామాలు తిరిగి రైతుల లిస్టు తయారు చేసి కలెక్టర్లకు ఇచ్చి పదేళ్లు చేసిన పాపాలను కడుక్కోవాలని సేచించారు. పార్టీలో చేరేవారు మా పాలన నచ్చి చేరుతున్నారు. మేము ఎవరిని భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం లేదు. మాకు కావలసినంత బలం ఉంది. చెరువులపై హరీష్ రావుకు మంచి అవగాహన ఉంది. అందుకే ఆయన హయాంలో కమిషన్ కాకతీయ వచ్చింది. చెరువుల కబ్జాలపై నిజనిర్ధారణ కమిటీ వేద్దాం. హరీష్ రావును ముందు పెడదాం. ఎవరి కబ్జాలు ఏంటో అప్పుడు తేలుతుంది.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హరీష్ రావు దొంగ అని తనకు తెలుసునని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'రుణమాఫీపై హరీష్ రావు చేసిన సవాల్‌కు కట్టుబడి లేదు. రాజీనామా చేయకుండా హరీష్ రావు పారిపోయారు. ఓడిపోయిన దొంగ హరీష్ రావు. రుణమాఫీ అనేది నా కమిట్మెంట్ నేను చెప్పాను చేసి తీరాను. ఇచ్చిన హామీలపై మూడు పార్టీలు బహిరంగ చర్చలు జరుపుదాం. అన్ని పార్టీల మేనిఫెస్టోలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చిద్దాం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. అప్పుడు కూడా పారిపోవద్దు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కాలేదు అంటే కేటీఆర్, హరీష్ రావు గ్రామాలు తిరగాలి. రాష్ట్రంలో అన్ని గ్రామాలు తిరిగి రైతుల ఖాతాలను లిస్టు తయారు చేసి కలెక్టర్లకి ఇవ్వాలి.

# తెలంగాణకు కేంద్రం శుభవార్త

మొదటి పేజీ తరువాయి...

ఖర్చు చేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం కింద 12 స్మార్ట్ సిటీలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఉత్తరాఖండ్‌లోని ఖుర్పియా, పంజాబ్‌లోని రాజ్పురా పాటియాలా, మహారాష్ట్రలోని డిఘి, కేరళలోని పాలక్కాడ్, యూపీలో ఆగ్రా, ప్రయాగ్ రాజ్, బీహార్‌లోని గయా, తెలంగాణలో జహీరాబాద్, ఏపీలోని ఓర్వకల్, కొప్పర్తి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ పాలిలో ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను నిర్మించనుంది. ఈ పారిశ్రామిక హబ్‌లలో రూ.1.5లక్షల కోట్ల పెట్టుబడి సామర్థ్యం ఉండగా.. ప్రత్యక్షంగా 10 లక్షల మందికి, పరోక్షంగా 30 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పొందనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు.

# కోల్‌కతా హత్యాచార ఘటన విచారకరం

మొదటి పేజీ తరువాయి...

ఇంటర్వ్యూలో అన్నారు. భారతీయ కూతుళ్లపై ఇలాంటి ఆకృత్యాలను ఏ నాగరిక సమాజం సహించదన్నారు. ఇప్పటికైనా ఈ దుర్మార్గాలను ఆపాలని ఆమె పిలుపునిచ్చారు. కొందరు వ్యక్తులు స్త్రీలను తక్కువగా, తక్కువ శక్తిమంతులుగా, తక్కువ సామర్థ్యం ఉన్నవారుగా, తక్కువ తెలివిగలవారుగా చూస్తారు. కూతుళ్లు, అక్కాచెలెళ్లపై ఇలాంటి అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజం అనుమతించదు. ఇలాంటి అభిప్రాయాలు ఉన్నవారు స్త్రీలను ఒక వస్తువుగా చూస్తారు. భయం నుండి విముక్తి పొందేందుకు వచ్చే అడ్డంకులను తొలగించడం మన ఆడపిల్లల కర్తవ్యం అని రాష్ట్రపతి తెలిపారు. నిర్భయ తర్వాత గత 12 ఏళ్లలో జరిగిన లెక్కలేనన్ని అత్యాచారాలను సమాజం మరచిపోయిందని, ఈ సామూహిక స్మృతి సరికాదని ఆమె అన్నారు. చరిత్రను ఎదుర్కోవడానికి భయపడే సమాజాలు సామూహిక విస్మృతిని ఆశ్రయిస్తాయి. భారతదేశం చరిత్రను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు రాష్ట్రపతి. సమాజం కొన్ని కఠినమైన ప్రశ్నలు వేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కూతుళ్లు, అక్కాచె÷–లలెళ్లపై ఇలాంటి అఘాయిత్యాల నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో నైట్ డ్యూటీ చేస్తున్న జూనియర్ డాక్టర్‌పై ఆగస్టు 9న అత్యాచారం జరిగింది. ఆ తర్వాత జూనియర్ డాక్టర్ దారుణ హత్యకు గురయ్యారు. వైద్యురాలి ముఖం, శరీరంపై గాయాలు కనిపించాయి. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే పోలీసుల అలసత్వం కారణంగా కలకత్తా హైకోర్టు ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. ఈ ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మెకు పిలుపు నిచ్చారు. వైద్యుల భద్రతకు సంబంధించి చట్టం చేయాలనే డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతా కేసుకు వ్యతిరేకంగా బెంగాల్‌తోపాటు దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి.

# ప్రజాక్షేత్రంలో ఇంకా బలంగా పని చేస్తా..

మొదటి పేజీ తరువాయి...

న్యాయం, ధర్మం గెలుస్తుందని చెప్పారు. తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. తాను కడిగిన ముత్యంలా అపవాదుల నుంచి బయటపడతానన్న కవిత.. నిజం కోసం పోరాటం చేస్తూనే ఉంటానన్నారు. ప్రజాక్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తామన్నారు. ఇంటికి చేరుకున్న కవితకు నివాసంలో తల్లి శోభ, కేటీఆర్ సతీమణి శైలిమతో పాటు ఇతర కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సోదరుడు కేటీఆర్‌కు కవిత రాఖీ కట్టారు. అలాగే, కుటుంబీకులను ఆలింగనం చేసుకొని.. తల్లి శోభమ్మ పాదాలకు నమస్కరించారు. రేపు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌కు చేరుకొని కేసీఆర్‌తో భేటీ అవుతారు.

# ఫిర్యాదులపై ఆధారాల సేకరణ

మొదటి పేజీ తరువాయి...

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన కొన్ని భవనాలను మున్సిపల్ అధికారులు ఇప్పటికే కూల్చివేశారు. ఇటీవల మరో బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థలకు సైతం హైడ్రా నోటీసులు ఇచ్చింది. మేడ్చల్ జిల్లా నాదెం చెరువు బఫర్‌జోన్‌లో రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్టు అక్రమ నిర్మించారంటూ నీటిపారుదల శాఖ ఫిర్యాదు మేరకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. దీనిపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ పంచాయతీ కొర్రెముల రెవెన్యూ పరిధిలోని 813 సర్వే నంబర్‌లో ఈ నిర్మాణాలు ఉన్నాయి. అయితే నాదెం చెరువుకు 30మీటర్ల బఫర్‌జోన్ వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా సదరు విద్యాసంస్థల యాజమాన్యం నిబంధనల్ని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే పల్లా మాత్రం అక్రమంగా కేసులు పెట్టారని, న్యాయపరంగా ముందుకు వెళ్తానని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు నిబంధనల ప్రకారం హైడ్రా ముందుకు వెళ్లాలని సూచించింది. ఇదిలావుంటే రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాలేజీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. వారం రోజుల వరకు కాలేజీలపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. వారం రోజుల్లో తహసీల్దార్ నోటీసులకు వివరణ ఇవ్వాలని విద్యాసంస్థలను ఆదేశించింది. కాలేజీల వివరణ కూడా విని చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని తహసీల్దార్‌కు న్యాయస్థానం సూచించింది. చిన్నదామెర చెరువునకు చెందిన 8 ఎకరాల 24 గుంటల భూమి ఆక్రమణకు గురైందని.. సర్వే నెంబర్లు 489, 485, 458, 484, 492, 489 భూముల్లో భవనాలు, షెడ్స్, వాహనాల పార్కింగ్ నిర్మాణాలు చేపట్టారని.. రోడ్ల నిర్మాణం కూడా చేపట్టారంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు . 7 రోజుల్లో కాలేజీల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని.. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఎంఎల్ఆర్ఐటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీలకు ఇచ్చిన నోటీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ లో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోని 13 చెరువుల ఆక్రమణలకు సంబంధించి వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలతోనే రెవెన్యూ అధికారులు ఈ నోటీసులు జారీ చేశారు.

# తెలంగాణకు అక్కరలేని విగ్రహాలను తొలగిస్తాం

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం.. రాసి పెట్టుకో అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాగా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపైనా కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తమ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

# సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయించారు. మెయిన్ గేట్ నుంచి భవనం లోపలకు వెళ్ళే క్రమంలో అందరికీ కనిపించేలా దాన్ని రూపొందిస్తున్నారు. అక్కడే ఇవాళ భూమి పూజ జరిగింది. దీన్ని శరవేగంగా డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలి ప్రభుత్వం సంకల్పించింది. 2009లో డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ ఇస్తున్నట్టు ప్రకటించారు. అందుకే ఆ తేదీన విగ్రహావిష్కరణ చేయాలని నిర్ణయించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఆర్టిస్టులు, తెలంగాణకు చెందిన కళాకారులు రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాలను పరిశీలించిన తర్వాత ఫైనల్ విగ్రహాన్ని ఖరారు చేయనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే ఉంటుందంటున్నారు. విగ్రహం తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా ఉంటుందని చెబుతున్నారు. తెలంగాణ ప్రజల దయాగుణం, త్యాగనిరత, మహిళల రూపం అన్నీ కలిసేలా రూపొందించనున్నారు. దసరా వరకు మంచిరోజులు లేవని వేదపండితులు చెప్పడంతోనే ఇప్పుడు హడావుడిగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఉండదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారన్నారు. సోనియమ్మ మాట ఇస్తే అది శిలాశాసనమని తెలంగామ రాష్ట్ర ఏర్పాటు నిరూపించిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని గుర్తు చేశారు. పదేళ్లు పరిపాలన చేసిన వారు తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని విమర్శించారు. నేనే తెలంగాణ.. తెలంగాణనే నేను అనే విధంగా గత పాలకులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. ప్రజాప్రభుత్వం అలాంటి విధానాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. సచివాలయం తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు గుండెకాయలాంటిదని అందుకే అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గత పాలకులు పదేళ్లు సచివాలయంలోకి ప్రజలకు ప్రవేశం కల్పించలేదని తెలిపారు. అదే కాకుండా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు వారికి మనసు రాలేదని ఆరోపించారు. ట్యాంక్ బండ్ నలువైపులా ఎంతో మంది ప్రముఖుల విగ్రహాలు ఉన్నాయని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందని అభిప్రాయపడ్డారు. మేధావుల సూచన మేరకే సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీన్ని వివాదం చేసేందుకే తెలంగాణ తల్లి

విగ్రహంతో ముడి పెట్టారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి వాళ్లు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభిస్తామని ఇప్పటికే రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విగ్రహం ఏర్పాటుకు ఇవాళ రేవంత్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు ఇవాళ శుభ దినమని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి తెలంగాణ తల్లి తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2004 కరీంనగర్‌లో తమ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మాట ఇచ్చారని.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తరువాత అనేక రకాలుగా వెనుక బడ్డారన్నారు. తెలంగాణ తల్లిని వెనక్కి నెట్టి వారే సర్వం అన్నట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. ముళ్ళ కంచె ఏర్పాటు చేసుకొని రాజ భోగం అనుభవించారన్నారు. అది ఒకప్పుడు ఘడీల భవనమని.. ఇప్పుడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవనమని పేర్కొన్నారు. పదేళ్లు ముఖ్యమంత్రి , మంత్రులు ఎవరూ అందుబాటులో లేరని.. అసలు సచివాలయంలోకి సామాన్యులకు ఎంట్రీయే లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి సచివాలయం నిర్మించిన వాళ్లకు కోటి రూపాయలు పెట్టి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టలేకపోయారని రేవంత్ విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదురుగా పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సచివాలయం ఎదురుగా ఖాళీ స్థలంలో కొంతమంది తమ కోసం ఆపారన్నారు. తెలంగాణ తల్లి అంటే దర్పం, పోరాట పటిమకు స్ఫూర్తి అని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ తల్లి దొరల కోటలో బందీ కావొద్దన్నారు.



## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించండి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఆగస్టు 28(ప్రభాత ఉదయం) ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించండి అని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయంలో నెరెడ్ మేట్ డివిజన్ పరిధిలోని మని ఎనక్లేవ్, ఓంశ్రీ అపార్ట్మెంట్స్ సభ్యులను తనతో తీసుకెళ్లి డిప్యూటీ కమిషనర్ రాజు కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రోడ్ల దుస్థితి, శానిటేషన్ , ఎలక్ట్రికల్ ఇతర సమస్యల పై అధికారులతో సమావేశంలో కాలనీవాసుల తన దృష్టికి తీసుకువచ్చిన అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... అధికారులు ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించాలని, సమయాన్ని నిర్దేశించుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెల అధికారిక సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజు, డి ఈ మహేష్, ఏ డి ఈ ముత్తయ్య, జిహెచ్ఎంసి ఎలక్ట్రికల్ ఇంజనీర్ వెంకటేష్, హార్టికల్చర్ డి ఈ మహేష్,టౌన్ ప్లానింగ్ తుల్జా సింగ్, అసిస్టెంట్ ఇంజనీర్ సృజన , నాయకులు ఉపేందర్ రెడ్డి, జీ.కే. రాము యాదవ్, హనుమంత రావు , మధు సుధన్ రెడ్డి ,జే.కే సాయి గౌడ్ తదితరులున్నారు.

# సైబర్ సిటీ, సెంట్రల్, రాజేంద్రనగర్ సర్కిల్ నూతన విద్యుత్ ఎస్ఈలను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

హైదరాబాద్,ఆగస్టు28(ప్రభాత ఉదయం) విద్యుత్ సైబర్ సిటీ, సెంట్రల్ సర్కిల్, రాజేంద్రనగర్ సర్కిల్ నూతన విద్యుత్ ఎస్ ఈ లు గా పదవి బాధ్యతలు స్వీకరించిన టీ చంద్రశేఖర్, సెంట్రల్ సర్కిల్ ఎస్ ఇ పి వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ ఈ డి శ్రీరామ్ మోహన్ లను ఇబ్రహీంబాద్ విద్యుత్ డివిజన్ సి ఎస్ సి ఎ డి సాయినాథ్, అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రవీణ్, ప్రదీప్, హాము నాయక్ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



సైబర్ సిటీ విద్యుత్ ఎస్ ఈ చంద్రశేఖర్ పుష్పగుచ్చం అందజేస్తున్న ఏ డిఈ, ఏఈలు



రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ కు పుష్పగుచ్చం అందజేస్తున్న ఏ డి ఈ సాయినాథ్



సెంట్రల్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ వెంకన్నకు పుష్పగుచ్చం అందజేస్తున్న అధికారులు

## పార్కు చేస్తామన్నారు...
# మురుగు కుంటగా మార్చేస్తున్నారు




మురికి కూపంగా మారిన నర్సాబాయి కుంట ను పరిశీలిస్తున్న ఎర్వ కుమార స్వామి, రమేష్ రెడ్డి లు

బుద్వేల్, ఆగస్టు28(ప్రభాత ఉదయం): నర్సబాయి కుంటను అభివృద్ధి చేస్తామని కోట్లు ఖర్చు పెట్టారు.... అయితే అది నేడు మురికి కూపంగా తయారైందని నవ యువ యువజన సంఘం అధ్యక్షులు ఎర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి లు అన్నారు. ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ బస్తీల నుంచి వచ్చే డ్రైనేజ్ పైప్ లైన్ నర్సబాయకుంట సమీపంలో పగిలిపోవడంతో మురుగు నీదంతా కుంట ను ఆనుకొని ఉన్న ఇండ్లలోకి వస్తుందని గుర్తు చేశారు. వారు బుధవారం నర్స బాయి కుంట పరిసర బస్తీలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని డ్రైనేజీ కాలువను పరిశీలించారు. పగిలిపోయిన పైప్ లైన్ బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బాబుల్ రెడ్డి నగర్ బస్తీని ఆనుకొని ఉన్న అంగన్వాడీ కేంద్రం , ప్రాథమిక పాఠశాల సమీపంలో మురుగు నీదు పారుతుండడంతో విద్యార్థులు తీవ్రత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలని కోరుతున్నారు. విష జ్వరాలు పబలుతున్న ప్రస్తుత కాలంలో ఇండ్ల మధ్యన మురుగునీరు పారుతుండడం అంతా మంచిది కాదన్నారు.



## భారీగా గంజాయి, హషిస్ అయిల్ పట్టివేత

రాజేంద్రనగర్,ఆగస్టు 28(ప్రభాత ఉదయం): అత్తాపూర్ మొగల్ కానాలా,ధూల్‌పేట్ ప్రాంతంలో రూ.46 లక్షల విలువ చేసే హషీష్ అయిల్, గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్,ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయిట్ కమిషనర్ ఖురేషి తెలిపారు.ఎక్సైజ్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.ఏపీలోని కడపకు చెందిన సాధిక్ వలీ,రంపచోడ వరానికి చెందిన హరికుమార్,సత్యనారాయణ అనే ముగ్గురు హైదారాబాద్‌కు 4.2 కిలోల హషీష్ అయిల్‌ను సరఫరా చేస్తుండగా ఉండగా మొగల్‌కా నాలా వద్ద పట్టుకున్నామని పేర్కొన్నారు.వారిని విచారిస్తున్న క్రమంలో రాజమండ్రిలో మరింతగా గంజాయి ఉన్నట్లు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యేకంగా ఓ బృందాన్ని పంపించి అక్కడి నుంచి 70.15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. హషిష్,గంజాయి విలువ రూ.46 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు.నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

## శివరాంపల్లి పివిఎన్ఆర్ ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 274 బస్టాప్ ఏర్పాటు కై వినతి

రాజేంద్ర నగర్,ఆగస్టు28(ప్రభాత ఉదయం): శివరాంపల్లి పివీ ఎన్ ఆర్ ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 274 వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్ ను ఏర్పాటు చేయాలని శివరాం పల్లి ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్ర నగర్ ఆర్ టి సి డిపో మేనేజర్ బద్రీనాథ్ కు వినతి పత్రం సమర్పించారు. శివరాంపల్లి పీవీఎన్ఆర్ ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 274 బస్సు షెల్టర్ ప్రయాణికులు రోడ్డు నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో యూ టర్న్ కూడా ఉండటం తో పాటు వేగంగా వచ్చే వాహనాలతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందో నని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతం లో ఇక్కడ బస్ షెల్టర్ ను ఏర్పాటు చేయాలని విన్నవించడం జరిగిందని వివరించారు. నిత్యం విద్యార్థులు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగస్తులు ఇతర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటరన్నారు. బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు వర్షాలకు తడుస్తూ, ఎండలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ బస్సు షెల్టర్ ఏర్పాటు జిహెచ్ఎంసి లో పరిధిలో ఉంటుందన్నారు. మేము మీరిచ్చిన నీతి పత్రాన్ని ఆసరాగా చేసుకుని జిహెచ్ఎంసి అధికారులకు సైతం బస్సు సెంటర్ ఏర్పాటుకు లేక రాస్తామని తెలిపారు. అందుకోసం జిహెచ్ఎంసి అధికారులకు వినతి పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పి వెంకటేష్, ఉపాధ్యక్షులు డి. ఆంజనేయులు, కార్యదర్శి పి.ప్రకాష్ రెడ్డి, శ్రీధర్,సాంస్కృతిక కార్యదర్శి సిద్ధం శ్రీనివాస్, సభ్యులు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



## చైతన్య డిమ్ టూబీ యూచైతన్యనివర్సిటీలో ఘనంగా ఓరియంటేషన్ డే ముఖ్య అతిథిగా డాక్టర్ సి.హెచ్.వి.పురుషోత్తంరెడ్డి

మొయినాబాద్,ఆగస్టు(ప్రభాత ఉదయం) విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం దిశగా క్రమ శిక్షణతో ముందుకు సాగినప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సి. హెచ్.వి. పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్ నగర్ సమీపంలో గల చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో ఓరియంటేషన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల కులపతి పురుషోత్తంరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ నాణ్యమైన విద్య అభ్యసించడానికి విద్యార్థులలో క్రమ శిక్షణ తోడైతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని పేర్కొన్నారు. భారతీయ, సంస్కృతి సాంప్రదాయాలను మరువకుండా గౌరవించాలని సూచించారు. విద్యార్థులకు కళాశాలలో అందిస్తున్న ఉత్తమ బోధనను క్రమ శిక్షణతో అలవర్చుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఎంచుకున్న లక్ష్యాన్ని గోల్ చేస్తు ముందుకు సాగినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ఉన్నత విద్యలో ప్రస్తుత సమాజంలో పోటీ తత్వం ఎంతో పేరిగిందని ఆయన తెలియజేశారు. విద్యార్థులు పోటీతత్వానికి ధీటుగా ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఇంజనీరింగ్ విద్య నాలుగు సంవత్సరాల పాటు సాగుతుందని ఈ నాలుగు సంవత్సరాలు కష్టం అనకుండా ఇష్టంతో విద్యను అభ్యసిస్తు ఏ రోజుకు ఆరోజు పరిశోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్రెడ్డి, ఉపకులపతి ప్రొఫెసర్ గుర్రపు దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ఓఎస్డ్ డాక్టర్ వీరవెంకటయ్య, డీన్ ప్రొఫెసర్ జి.శంకర్ంగం, ప్రొఫెసర్ కవిత, ఆర్. కృష్ణఫర్, సైన్స్ ప్రొఫెసర్ సుందర్రామ్, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హైడ్రా విషయంలో అధికారుల మరో ముందడుగు

### త్వరలో అక్రమ కట్టడాలకు అనుమతి ఇచ్చిన అధికారులపై కేసులు



మొయినాబాద్ ఆగస్టు 28 (ప్రభాత ఉదయం) అక్రమ నిర్మాణ దారుల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న హైడ్రా అధికారులు ఇప్పటికే రాష్ట్రంలో సంచలనంగా మారింది అక్రమ నిర్మాణాలు కబ్జాలు చేస్తున్న వాళ్ళు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదంటూ ఇప్పటికే పలు హెచ్చరికలు జారీచేసిన విషయమే ఐతే రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల మద్దతు వ్యతిరేకత కొనసాగుతున్న నేపథ్యంలో హైడ్రా అధికారులు మరో ముందడుగు తో త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్లు. ప్రత్యేక చట్టం కూడా కూడా తేనున్నట్లు తెలిపారు.అదేవిధంగా అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కేసులు పెడతాం అని అన్నారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు



ఉత్తమ ఫలహారపు బండి అవార్డును గౌతమ్ ముదిరాజ్ కు అందచేస్తున్న వివిధ రంగాల ప్రముఖులు

## ఉత్తమ ఫలహారపు బండి అవార్డును గెలుచుకున్న గౌతమ్ ముదిరాజ్

బుద్వేల్, ఆగస్టు28(ప్రభాత ఉదయం) : ఉజ్వల సాంస్కృతిక సామాజిక చైతన్య సంస్థ ఆధ్వర్యంలో బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్ హాల్ లో మంగళవారం రాత్రి లస్కర్ బోనాల జాతర పేరిట బోనాల ఉత్సవాలలో వివిధ కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి అవార్డుల ప్రధానోత్సవం చేశారు. రంగారెడ్డి జిల్లా తరఫున ఫలహారపు బండి ఊరేగింపు విభాగంలో రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ కి చెందిన బ్రాహ్మణపల్లి బాల్ రాజ్ ముదిరాజ్ కుమారుడు బ్రాహ్మణపల్లి గౌతమ్ ముదిరాజ్ కు అవార్డు లభించింది. అవార్డును బీసీ కమిషన్ చైర్మన్ వకులాబరుణం కృష్ణమోహన్, దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా గౌతమ్ ముదిరాజ్ కు అందజేశారు.

## రెండంతస్థుల పై నుంచి క్రింద పడి మేస్త్రీ దుర్మరణం


బుద్వేల్, ఆగస్టు28(ప్రభాత ఉదయం) : రెండంతస్తుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ మేస్త్రి ఆక్కడికక్కడే దుర్మరణం చెందాడు . ఈ సంఘటన రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ లో బుధవారం ఉదయం జరిగింది . మాణిక్యమ్మ కాలనీలో నివసించే పెద్ద చెన్నయ్య (35 ) స్థానికంగా నివసించే దత్తు నిర్మిస్తున్న ఇంటి పనిలో మేస్త్రి గా పనిచేస్తున్నాడు. ఉదయం 9:30 గంటల సమయంలో రెండంస్థుల భవనంపై కట్టిన గోవా పై ఎక్కిన చెన్నయ్య ప్రమాదవశాత్తు కింద పడి మరణించాడు. సమాచారం తెలుసుకున్న రాజేంద్ర నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పెద్ద చెన్నయ్య

### మృతుని కుటుంబానికి నష్టపరిహారంగా రూ. 8.5 లక్షలు :

రెండంతస్తుల భవనం పై నుంచి కింద పడి మరణించిన పెద్ద చెన్నయ్య కు భార్య శ్రీశైల, ఇద్దరు కుమార్తె లు ఉన్నారు. వారికి ఇంటి యజమాని దత్తుతోపాటు మేస్త్రి మాధవరావు రూ.8.5 లక్షల నష్ట పరిహారం ఇవ్వడానికి ముందుకు వచ్చారు.



స్వర్గీయ జిహెచ్ఎంసి ఇంజనీర్ లచ్చి రామ్ నాయక్ స్వగ్రామం వీర్లగడ్డ తండాలో విగ్రహాన్ని ఆవిష్కరించిన శ్రీనివాస్ రెడ్డి

## లచ్చిరాం సేవలు మరువలేనివి: శ్రీనివాస్ రెడ్డి

అనుముల ఆగస్టు28(ప్రభాత ఉదయం) జిహెచ్ఎంసి, పురపాలక శాఖలో ఇంజనీర్ గా పనిచేసిన లచ్చిరాం నాయక్ సేవలు మరువలేని వని అడిషనల్ కమిషనర్ ఎస్ శ్రీనివాస రెడ్డి కొనియాడారు. బుధవారం స్వర్గీయ లచ్చిరాం నాయక్ స్వగ్రామమైన నల్గొండ జిల్లా అనుముల(హాలియా) మండలం వీర్లగడ్డ తాండ లో శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డ్ డి ఈ గౌస్ మొహినుద్దీన్, ప్రముఖ కాంట్రాక్టర్ గుమ్మకొండ యాదవ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరాం మిత్రులు, అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి లచ్చిరాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... కు గ్రామంలో జన్మించిన లచ్చి రామ్ నాయక్ ఉన్నత విద్యను అభ్యసించి మున్సిపల్ శాఖలో ఇంజనీర్ గా ఉద్యోగంలో చేరి అంచలంచలుగా ఉన్నత ఉద్యోగానికి చేరుకుని ఎన్నో సేవలు చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. లచ్చి రామ్ నాయక్ తన స్వగ్రామం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.

## ప్రతి బస్తీలో, కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి

### డిప్యూటీ కమిషనర్ కె .రవి కుమార్

బుద్వేల్, ఆగస్టు27(ప్రభాత ఉదయం) : ప్రతి బస్తీలో... కాలనీలో దోమల నివారణ కు నిత్యం ఫాగింగ్ చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ఎంటమాలజీ విభాగం సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం ఎంటమాలజీ విభాగం సిబ్బంది తో పాటు ఆయన ఏ ఈ ఉదయ్ తో సమావేశమైనారు. ప్రతి కాలనీలో దోమల నిర్మూలన కోసం ఫాగింగ్ చేయాలన్నారు.




ఎంటమాలజీ విభాగం సిబ్బందితో డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఉదయ్ లు

